క్లుప్తంగా

ఇళ్ల క్రమబద్ధీకరణకు అవకాశం

తహసీల్దార్ అశోక్ కుమార్

కుల్కచర్ల: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరించుకునేందుకు(రెగ్యులరైజ్) ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని తహసీల్దార్ అశోక్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఓ నంబర్ 58, 59 ప్రకారం దారిద్ర రేఖకు దిగువన ఉండి 2020లోపు 125 గజాల వరకు ఇళ్లు నిర్మించుకున్న వారు రెగ్యులరైజ్ చేసుకునేందుకు మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 125 గజాల కంటే ఎక్కువ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారు తగిని రుసుం(ఫీజు) చెల్లించాలని సూచించారు.

పగిడియాల బీపీఎంగా అరుణ్‌కుమార్

యాలాల: మండల పరిధిలోని పగిడియాల బీపీఎం(బ్రాంచ్ పోస్టు మాస్టర్) పాండు రంగారెడ్డి బదిలీ అయ్యారు. యాలాల మండలంలోని బెన్నూరు బీపీఎంగా బదిలీచేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పెద్దేముల్ మండలం నాగులపల్లి బీపీఎంగా విధులు నిర్వహిస్తున్న అరుణ్‌కుమార్‌ను పగిడియాల బీపీఎంగా కేటాయించినట్లు యాలాల పోస్టుమాస్టర్ ఫిరోజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

కుల్కచర్ల: హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పరిగి, మహబూబ్‌నగర్ ప్రధాన రహదారి వెంట నాటిన మొక్కలకు నల్లమట్టి వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూసారం దెబ్బతినడంతో మొక్కల ఎదుగుదల లోపించడంతో మొక్కలకు మట్టి వేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎఫ్ అవకతవకలపై కమిషనర్‌కు ఫిర్యాదు

తాండూరు రూరల్: సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పీఎఫ్ అవకతవకలపై ఈపీఎఫ్(ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్) కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని కరన్‌కోట్ శివారులో ఉన్న సీసీఐ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల నుంచి పీఎఫ్ వసూలు చేసి భవిష్యత్ నిధి సంస్థలో జమ చేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమగ్ర విచారణ చేపట్టి కార్మికులకు న్యాయం చేయాలన్నారు.

దేశాన్ని నాశనం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

షాబాద్: ప్రధాన మంత్రి మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా ఇద్దరూ కలిసి దేశాన్ని నాశనం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి పీ జంగయ్య ఆరోపించారు. శుక్రవారం మండలంలోని తాళ్లపల్లి, నాగర్‌గూడ, రుద్రారం, చందనవెళ్లి, హైతాబాద్, మద్దూర్, సోలీపేట్, మాచన్‌పల్లి, నాంధార్‌ఖాన్‌పేట్ గ్రామాల్లో మోదీ హటావో.. దేశ్ బచావోలో భాగంగా ఇంటింటికి సీపీఐ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిందని, ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందని విమర్శించారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో మతం పేరుతో రెచ్చగొట్టే ప్రకటనలు చేసి లబ్ధి పొందడం హేయమైన చర్య అని అన్నారు. భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కార్మిక చట్టాలను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ కే రామస్వామి, కో-కన్వీనర్ ప్రభులింగం, మండల కార్యదర్శి సుధీర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వీ సత్యనారాయణ, మండల సహాయ కార్యదర్శి మక్బూల్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ, నాయకులు మంజుల, ఎస్ జంగయ్య, రక్కయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమాతో ప్రయోజనం

ఎస్‌బీఐ చేవెళ్ల బ్రాంచ్ మేనేజర్ శ్రీశైలం



చెక్కు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

చేవెళ్ల: ప్రమాద బీమా సౌకర్యం వల్ల బాధిత కుటుంబానికి ప్రయోజనం లభిస్తుందని ఎస్‌బీఐ చేవెళ్ల బ్రాంచ్ మేనేజర్ శ్రీశైలం అన్నారు. చేవెళ్ల ఎస్‌బీఐ శాఖలో శుక్రవారం ప్రమాద బీమా ద్వారా వచ్చిన రూ. 20లక్షల విలువ చేసే చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాలట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీశైలం ఎస్‌బీఐలో సంవత్సరానికి రూ. వెయ్యి ప్రమాద బీమా పాలసీ చేయించారని తెలిపారు. మూడు నెలల కిత్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, దీంతో కుటుంబానికి ప్రమాద బీమా డబ్బు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీమా ఏరియా మేనేజర్ సాయిరామ్, ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయం చేసే వరకు పోరాటం

సమ్మె బాటపట్టిన పంచాయతీ జూనియర్ కార్యదర్శులు



తాండూరు రూరల్: సమ్మె చేస్తున్న పంచాయతీ జూనియర్ కార్యదర్శులు



పెద్దేముల్: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట..

తాండూరు రూరల్: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ జూనియర్ కార్యదర్శులు తమ విధులను బహిష్కరించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని తేల్చిచెప్పారు. శుక్రవారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ జూనియర్ కార్యదర్శులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పంచాయతీ జూనియర్ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ కాలాన్ని సర్వీసు కాలంగా గుర్తించాలన్నారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేసే పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. విధుల్లో ప్రాణాలు కోల్పోయిన పంచాయతీ కార్యదర్శి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లాలప్ప, అశోక్, ఫక్రోజీ, కరుణాకర్, భవాని, శివాని, అంబిక, శృతి, సుజాత, సరిత, శిరీష పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణలో ప్రభుత్వం విఫలం

కుల్కచర్ల: ప్రభుత్వం పంచాయతీ జూనియర్ కార్యదర్శుల పనితీరు ఆధారంగా క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయా గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ జూనియర్ కార్యదర్శులు, కాంట్రాక్టు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనంతగిరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేపీఎస్‌లు శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్, ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

కొడంగల్ రూరల్: గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే పంచాయతీ జూనియర్ కార్యదర్శుల(జేపీఎస్) సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు శాంతియుత సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేపీఎస్‌లను వెంటనే నాలుగేళ్ల సర్వీస్‌తో కలిసి రెగ్యులరైజ్ చేయాలని, ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా గుర్తిస్తూ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతి చెందిన జేపీఎస్‌ల కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తూ వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఈ.కృష్ణయ్య, మల్లప్ప, విజయభాస్కర్‌రెడ్డి, వరుణ్‌కుమార్, వసీం అక్రం, చైతన్య, కృష్ణవేణి, అంజలి, సుబాష్, శ్రీలత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు కాలంగా పరిగణించండి

యాలాల: పంచాయతీ జూనియర్ కార్యదర్శుల ప్రొబేషన్ కాలాన్ని సర్వీసు కాలంగా పరిగణించాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు. జేపీఎస్‌ల డిమాండ్ల సాధన కోసం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ.. కార్యదర్శుల రెగ్యూలరైజేషన్ జీఓను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను జేపీఎస్‌లుగా ప్రమోట్ చేస్తూ.. వారి కాలాన్ని ప్రొబేషన్ పీరియడ్‌గా గుర్తించాలన్నారు. అర్హులైన వారికి పదోన్నతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. 317 జీఓ వల్ల నష్టపోయిన కార్యదర్శులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న కార్యదర్శులకు సీనియర్ పంచాయతీ కార్యదర్శి వీరప్ప మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సుధాకర్, వెంకటయ్య, పావని, లలిత, దీప, కిరణ్‌కుమార్, ఉదయ్‌కుమార్, సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగభద్రత కల్పించాలి

పెద్దేముల్: సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా పంచాయతీ జూనియర్ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మెకు దిగారు. గ్రామస్థాయిలో సంక్షేమ పథకాల అమలుకు పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. ఈ సమ్మెలో రాజు, శ్రావన్, చంద్రశేఖర్, ఆనంద్, జమీల్, గఫార్, మహేశ్, నరేశ్, రమేశ్, నర్సింహారెడ్డి, స్నేహలత, వాణి, అర్చన, సంధ్య, అరుణ, రాజశ్రీ, ఇంద్రజ. సంజీవ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దోమ: ప్రభుత్వం పంచాయతీ జూనియర్ కార్యదర్శుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ జూనియర్ కార్యదర్శులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయా గ్రామాల జేపీఎస్‌లు తమ సమస్యలను పరిష్కరించాలంటూ విధులు బహిష్కరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు.

ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చండి

దౌల్తాబాద్: తమను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో పంచాయతీ జూనియర్ కార్యదర్శులు శుక్రవారం నుంచి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగేళ్ల ప్రొబేషన్ పీరియడ్ పూర్తైన తమను రెగ్యులరైజ్ చేసే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఓపీఎస్‌లను వెంటనే జేపీఎస్‌లుగా మార్చాలని, జేపీఎస్‌లను వెంటనే రెగ్యులరైజ్ చేసి సీనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఆనందం, సంతోష్ తదితరులన్నారు.

హామీ మరిచారు

బషీరాబాద్: పంచాయతీ జూనియర్ కార్యదర్శులు జిల్లా వ్యాప్తంగా సమ్మెబాట పట్టారు. అసెంబ్లీలో మూడేళ్లకు రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు వారు శుక్రవారం బషీరాబాద్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దీక్షకు కూర్చున్నారు.



బషీరాబాద్: దీక్షలో పంచాయతీ కార్యదర్శులు



దౌల్తాబాద్: జేపీఎస్‌ల ధర్నా



దోమ: సమ్మె చేస్తున్న పంచాయతీ జూనియర్ కార్యదర్శులు

పౌష్టికాహారంపై నిర్లక్ష్యం తగదు

సీడీపీఓ ప్రియదర్శిని



మాట్లాడుతున్న సీడీపీఓ ప్రియదర్శిని

కుల్కచర్ల: అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం నాణ్యత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సీడీపీఓ ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బాలమృతం, గుడ్లు, పాలు, మధ్యాహ్న సంపూర్ణ భోజనం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని సూచించారు. వేసవి నేపథ్యంలో మేలో వివాహాలు ఎక్కువగా జరుగుతాయని, బాల్య వివాహాలపై దృష్టి పెట్టాలన్నారు. ఏ గ్రామంలోనైనా బాల్యవివాహం చేస్తున్నట్లు తెలిస్తే 1098కి కాల్ చేసేలా చైల్డ్‌లైన్ సిబ్బందితో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు అంజమ్మ, హన్మంతు, చైల్డ్‌లైన్ ప్రతినిధి రాంచంద్రయ్య, చౌడాపూర్ సెక్టార్ అంగన్వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

పౌరాణిక కళలను ప్రోత్సహించాలి

వైస్ ఎంపీపీ మల్లేశం

దోమ: పౌరాణిక కళలను ప్రోత్సహించాలని వైస్ ఎంపీపీ మల్లేశం అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన చిరుతల రామాయణం వీధి నాటకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. నేటి సమాజంలో ఆధ్యాత్మిక ఆటలు, పౌరాణిక వీధి నాటకాలు కనుమరుగవుతున్నాయని అన్నారు. గ్రామాల్లో వాటికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయడం సంతోషాన్నిస్తుందన్నారు. యువత నాటికల సారాంశాన్ని తెలుసుకుని సన్మార్గంలో నడవాలన్నారు. అనంతరం కళాకారుల బృందానికి ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి అందించిన రూ.15వేల నగదు నిర్వాహకులకు అందించారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్, గ్రామస్తులు సుధాకర్‌రెడ్డి, జనార్ధన్, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గొర్ల పంపిణీకి సత్వర చర్యలు

మండల పశువైద్యాధికారి శ్రీకర్‌రెడ్డి



డీడీలు కట్టిన రైతుల వివరాలను పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీకర్‌రెడ్డి

యాలాల: రెండో విడత గొర్ల పంపిణీలో భాగంగా సకాలంలో రైతులకు పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు మండల పశువైద్యాధికారి శ్రీకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశువైద్యాలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులతో సమావేశమయ్యారు. రెండో విడతలో భాగంగా యాలాల మండలానికి 691 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఒక్కో యూనిట్‌లో 20 గొర్లు, ఒక పొట్టేలు రైతుకు అందజేస్తామన్నారు. ఒక్కో యూనిట్‌కు సబ్సిడీ పోను రూ.43,750లను లబ్ధిదారుడు విధిగా డీడీ చెల్లించాలన్నారు. ఇప్పటికే మండలం నుంచి మొత్తం 130మంది రైతులు డీడీలు కట్టారనిన్నారు. డీడీలు చెల్లించిన ప్రతీ రైతుకు సకాలంలో గొర్ల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.

మండలాన్ని ప్రకటించే వరకు ఉద్యమం



మండల సాధన దీక్షలో మాట్లాడుతున్న ప్రభుకుమార్

పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభుకుమార్

పెద్దేముల్: ప్రభుత్వం తట్టెపల్లిని కొత్త మండల కేంద్రంగా ప్రకటించేవరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని తట్టెపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభుకుమార్ అన్నారు. తట్టెపల్లిని మండలం ఏర్పాటు చేయాలని తట్టెపల్లితో పాటు వివిధ గ్రామాల ప్రజలు చౌరస్తా వద్ద రిలే దీక్షల్లో పాల్గొన్నారు. ఈ దీక్షలు శుక్రవారంతో 22వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ప్రభుకుమార్, ఏసప్ప మాట్లాడుతూ.. 9 గ్రామాలతో కొత్త మండలంగా ప్రకటించి.. 11గ్రామాలున్న తట్టెపల్లిని ఎందుకు మండలంగా ప్రకటించడం లేదని ప్రశ్నించారు. మండలంగా అప్‌గ్రేడ్ చేయకుంటే వచ్చే రోజుల్లో తమ సత్తా చూపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు ఏసు, మాజీ సర్పంచ్ మల్లప్ప, రియాజ్, మహబూబ్, పండరి, జహీర్, మున్వర్, ఇస్మాయిల్, బాబుపటే ల్, ఈసు ఫ్ మియా, బక్కప్ప, కయ్యుం, ఖదీర్, జైపాల్, సాబేర్, సోయల్, విద్యాకర్, ముస్తార్ పాల్గొన్నారు.

మైనార్టీల మహాత్ముడు అంబేడ్కర్

మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఇసాక్

బొంరాస్‌పేట: రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్లు కల్పించి అంబేడ్కర్ మైనార్టీల మహాత్ముడుగా పేరొందారని బీఆర్ఎస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఇసాక్ అన్నారు. శుక్రవారం దుద్యాల మండల పరిధిలోని గౌరారంలో శనివారం దౌల్తాబాద్ మండలం మాటూరులో నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అంబేడ్కర్ చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తుప్పలి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇసాక్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ చేసిన కృషికి మైనార్టీలు రుణపడిఉన్నారన్నారు. అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటులో ముస్లింలు ముందుండాలన్నారు. మాటూరు మహాసభకు ప్రజలు భారీగా తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో బొంరాస్‌పేట మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు తోలు వెంకటయ్య, స్వేరో సర్కిల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సురేశ్, రాము తదితరులున్నారు.

కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో..

కుల్కచర్ల: దౌల్తాబాద్ మండల పరిధిలోని మాటూర్ గ్రామంలో శనివారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్, స్వేరో సంఘం నేతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చెల్లాపూర్ మాజీ సర్పంచ్ వెంకటయ్య, అంబేడ్కర్, స్వేరో సంఘాల నేతలు కనకం మొగులయ్య, జోగు వెంకటయ్య, పెంటయ్య, గుండుమల్ల నర్సింహులు, నాగని వెంకట్రాములు, తుప్పలి వెంకట్‌రామ్, బాలకృష్ణ, యాదగిరి, బాలు, రమేశ్, శ్రీనివాస్, బహుజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బడుగులకు రాజ్యాధికారం

షాద్‌నగర్ టౌన్: దేశంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాధికారం బీఎస్పీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింగం అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు డీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఎస్పీ తెలంగాణ భరోసా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల ప్రజలు రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో బీసీలకు విద్య, ఉద్యోగం, రాజకీయంగా, ఆర్థిక రంగాల్లో తీరని అన్యాయం జరుగుతోందన్నారు. రాజ్యాంగం కోరుకున్న ప్రజాస్వామ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీఎస్పీ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో మే7న నిర్వహించనున్న తెలంగాణ భరోసా సభకు బీఎస్పీ అధినేత్రి మాయావతి రానున్నారని అన్నారు. ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కోశాధికారి రాంప్రసాద్‌గౌడ్, జిల్లా కార్యదర్శి నర్సింలు, ప్రశాంత్, దర్శన్, ఇంద్రసేన, అనంతయ్య, కుమార్, శ్రీనివాస్, మల్లేష్, రాజేష్‌చౌహాన్, నర్సయ్య శివకుమార్, సాయిలు, రమేష్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు సర్వాయి పాపన్న



ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నేతలు

కుల్కచర్ల: మూడు వందల ఏళ్ల క్రితం వెనుకబడిన వర్గాల పక్షాన పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఇప్పాయపల్లి గౌడ సంఘం నేతలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇప్పాయిపల్లిలో మే 2న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోండి



ఆర్టీసీ సేవలను వివరిస్తున్న డీఎం పవిత్ర

పరిగి: ఆర్టీసీ సేవలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఆర్టీసీ డీఎం పవిత్ర అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాఘవపూర్ తదితర గ్రామాల్లో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమాన్ని నిర్వహించి ఆర్టీసీ సేవలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విహారయాత్రలు, వివాహాలు తదితర కార్యక్రమాలకు ప్రత్యేక ప్యాకేజీలతో బస్సులను నడుపుతామన్నారు. ఆర్టీసీలో కార్గో సేవలను అందుబాటులోకి వచ్చాయన్నారు. నగరాల్లో నుంచి ఏ సామగ్రి అయినా కార్గో సేవలతో సురక్షితంగా ఇంటికి పంపించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ సందర్శనకు విద్యార్థులు



రసాయన శాస్త్ర విభాగాన్ని సందర్శించిన విద్యార్థులు

కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించారు. డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్న ద్వితీయ, తృతీయ సంవత్సరం 60 మంది విద్యార్థులు వర్సిటీలోని కెమిస్ట్రీ విభాగంలోని ల్యాబ్‌లను సందర్శించారు. అక్కడి అధ్యాపకులు విద్యార్థులకు రసాయన శాస్త్రానికి సంబంధించి పలు అంశాలను వివరించినట్లు తెలిపారు.

– కొడంగల్

పింఛన్ పాట్లు

పెద్దేముల్: ప్రతీ నెల పండుటాకులకు పెన్షన్ టెన్షన్ తప్పడం లేదు. గ్రామాల్లో సిగ్నల్ సమస్యల కారణంగా సర్వర్ పనిచేయడం లేదు. దీంతో ఉదయం వచ్చిన వృద్ధులు సాయంత్రం వరకు పడిగాపులుకాస్తున్నారు. సర్వర్ సమస్యల కారణంగా బీపీఎంలకు పెన్షన్ పంపిణీ తలనొప్పిగా మారుతోంది. శుక్రవారం తట్టెపల్లి గ్రామంలో సాంకేతిక సమస్యల కారణంగా బీపీఎం కార్యాలయం ఎదుట వృద్ధులు బారులు తీరారు. ప్రతీ నెల ఈ ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు.



తట్టెపల్లిలో పెన్షన్ కోసం బారులు తీరిన వృద్ధులు